క్లుప్తంగా

అయ్యప్ప దీక్షతో మానసిక ప్రశాంతత



పెద్దశంకరంపేటలో అయ్యప్ప దీక్ష స్వీకరిస్తున్న భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): అయ్యప్ప దీక్షతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని గురుస్వామి రామచంద్రాచారి అన్నారు. బుధవారం పలువురు భక్తులు అయ్యప్ప దీక్షను స్వీకరించారు. ఈ సందర్భంగా వారికి మాలధారణ నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు రాములు, శ్రీహరి, మహేందర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ తనిఖీ



అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా ఎన్నికల సిబ్బంది

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని అంబులెన్స్‌లను జిల్లా ఎన్నికల సిబ్బంది బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఎలాంటి అనుమానిత వస్తువులను రవాణా చేయరాదని సూచనలు చేశారు. అంబులెన్స్ నిర్వాహకులు ఎన్నికల నిబంధనల మేరకు విధులను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారులు పీఎం జనార్దన్, ఈఎంఈ మహేశ్, అంబులన్స్ నిర్వాహకులు రమేశ్, నవీన్, శ్రీకాంత్, సురేశ్ ఉన్నారు.

మనోహరాబాద్‌లో 22 పోలింగ్ కేంద్రాలు



తహసీల్దార్ శ్రీనివాస్‌రావు

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రం మనోహరాబాద్‌లో 22 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 19, 336 మంది ఓటర్లు ఉండగా, వారిలో మహిళలు 9,595, పురుషులు 9741 మంది ఉన్నారని, వారి కోసం 22 బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఆయా బూతులకు అన్ని వసతులు ఏర్పాటు చేశామన్నారు. సంబంధిత పోలింగ్ సిబ్బంది సాయంత్రం తమకు కేటాయించిన బూత్‌లకు చేరుకున్నట్లు తెలిపారు. కాగా మండల కేంద్రంలో 3, కాళ్లకల్‌లో 5 బూత్‌లను, నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోకి గౌతోజీగూడెం, పర్కిబండ, పోతారం గ్రామాల బూత్‌లు ఉన్నాయన్నారు. ఓటర్లకు ఏలాంటి ఇబ్బందులు కాకుండా తగిన చర్యలు చేపట్టామని అన్నారు.

పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరా, ఫ్యాన్లు చోరీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లి పోలింగ్ కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి ఒక సీసీ కెమెరా, మూడు ఫ్యాన్లు చోరీ చేశారు. బుధవారం పోలింగ్ కేంద్రం ఇన్‌చార్జి ప్రణయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలింగ్ కేంద్రం వద్ద మంగళవారం రాత్రి వరకు ఫ్యాన్లు, సీసీ కెమెరాలు బిగించి ఇతర ఏర్పాట్లు చేసి, తాళం వేసి వెళ్లామని చెప్పారు. కాగా ఉదయం వచ్చి చూడగా 90వ పోలింగ్ కేంద్రం గదిలో గుర్తు తెలియని వ్యక్తి తాళం పగులగొట్టి పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాతో పాటు మూడు ఫ్యాన్లు చోరీ చేశారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దరాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చేగుంట(తూప్రాన్): మండలంలోని రెడ్డిపల్లిలోని పోలింగ్ కేంద్రాలను తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెడ్డిపల్లిలోని 221, 222, 223 నంబర్ల పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి, కేంద్రాల్లోని వసతులు ఓటర్లకు తొందరగా అర్థమయ్యేలా చేసిన ఏర్పాట్లు పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో తీసుకోవాల్సిన పలు జాగ్రతలను ఎన్నికల సిబ్బందికి సూచించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ గియాసున్నిసాబేగం, ఆర్ఐ నర్సింగ్ యాదవ్ తదితరులు ఉన్నారు.



రెడ్డిపల్లిలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం



టేక్మాల్‌లో నీటిలో తేలియాడుతున్న ధాన్యం



చందూర్‌లో ధాన్యాన్ని సరిచేస్తున్న రైతులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి భారీగా వర్షానికి కొనుగోలు కేంద్రాల వద్ద, కల్లాల వద్ద పలువురు రైతులు ఆరబోసుకున్న ధాన్యం పూర్తిగా తడసిపోయింది. సాగు ప్రారంభంలో పడని వర్షాలు, పంట చేతికొచ్చే సమయంలో, చేతికొచ్చిన పంటను ఆరబోసుకున్న సమయంలో ఆకాల వర్షాలు పడడంతో ఏం చేయాలో తోచక రైతులు ఆవేదనకు గురవుతున్నారు. ఆకాల వర్షం కారణంగా ఆరబోసుకున్న ధాన్యం తడిసిపోవడంతో, రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆందోళనలో రైతులు

టేక్మాల్(మెదక్): మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. కోతలు కోసి ధాన్యం ఆరబోసిన ధాన్యమంతా తడిసి ముద్దయింది. టేక్మాల్, ఎల్లుపేట, బొడ్మట్‌పల్లి, ధనూర కొనుగోలు కేంద్రాల్లో సంచుల్లో నింపిన ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులకు తీవ్ర నష్టం కలిగింది.

పెద్దశంకరంపేటలో భారీ వర్షం

పెద్దశంకరంపేట(మెదక్): పేట మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. ఆయా గ్రామాల్లో వరికోతలు పూర్తయి, కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం విక్రయించడానికి తెచ్చిన ధాన్యం వర్షానికి తడిసింది. అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



టేక్మాల్‌లో తడిసిన వరిధాన్యం బస్తాలు

గ్రామాలకు చేరుకున్న ఎన్నికల అధికారులు



చిన్నశంకరంపేట(మెదక్): పోలింగ్‌బూత్‌కు ఈవీఎంలతో వస్తున్న ఎన్నికల సిబ్బంది

- మండలంలో 40 పోలింగ్ బూత్‌లు.. ఐదు రూట్‌లు
- 20 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు

చిన్నశంకరంపేట(మెదక్): శాసనసభ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎన్నికల అధికారులు ఈవీఎంలతో గ్రామాలకు చేరుకున్నారు. మండలంలో 29 జీపీల్లో కలిపి 40 పోలింగ్‌బూత్‌లు ఉన్నాయి. మండలంలో 32వేల మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకొనున్నారు. మండలంలో ఐదు రూట్‌లుగా గుర్తించిన అధికారులు అవసరమైన ఏర్పట్లను చేశారు. ఐదు రూట్‌ల్లో మొబైల్ టీం అధికారులతో పాటు 220 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



సిద్ధమైన పాపన్నపేట పోలింగ్ కేంద్రం

పాపన్నపేట(మెదక్): మండలంలో గురువారం జరుగనున్న పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ లక్ష్మణ్ బాబు తెలిపారు. మండల వ్యాప్తంగా 58 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ కేంద్రంలో పీఓ, ఏపీఓతో పాటు ఇద్దరు పోలింగ్ ఆఫీసర్లు ఉంటారన్నారు. ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

మోడల్ పోలింగ్ కేంద్రం ముస్తాబు



తాటి మట్టలతో పందిరి వేస్తున్న సిబ్బంది



కౌడిపల్లి మోడల్ పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలో మోడల్ పోలింగ్ కేంద్రంగా ఎంపిక అయింది. దీంతో అధికారులు ముస్తాబు చేస్తున్నారు. బుధవారం పోలింగ్ కేంద్రం ఇన్‌చార్జి, వార్డెన్ ప్రణయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం బీఎల్‌ఓలు ఇతర అధికారులు పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. హెల్ప్‌డెస్క్‌ను తాటిమట్టలతో పందిరి వేస్తున్నారు. కేంద్రం వద్ద పేయింటింగ్‌తో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు. పోలింగ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వారు చెప్పారు.

ఎయిడ్స్ రహిత సమాజమే ధ్యేయం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసీటీసీ కౌన్సిలర్ తిరుపతి

హుస్నాబాద్: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. జిల్లెల్లగడ్డ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల (బాలురు) ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఎయిడ్స్ రావడానికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈసందర్భంగా ఐసీటీసీ కౌన్సిలర్ తిరుపతి మాట్లాడుతూ.. జీవితంలో ప్రతి అడుగు జాగ్రత్తగా వేస్తూ ఎయిడ్స్ రహిత సమాజం కోసం పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ వాసుదేవ్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీకాంత్ అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తా



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న టోప్యాతండా వాసులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని టోప్యాతండాలో ఎంపీ ఎన్నికల సమయానికి పాలింగ్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు తనవంతు ప్రయత్నం తప్పకుండా చేస్తానని తహసీల్దార్ ముసాద్దీక్ అన్నారు. గురువారం మండలంలోని టోప్యాతండా వాసులకు పాలింగ్‌స్టేషన్ లేకపోవడంతో, వారు పక్కనే ఉన్న గౌతాపూర్‌లోని 85 పాలింగ్‌స్టేషన్‌ల్లో తమ ఓటు వినియోగించుకోవాలి. దీంతో ఆగ్రహానికి గురైన తండావాసులు తహసీల్దార్, ఎంపీడీఓ శశిప్రభకు పాలింగ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తండావాసులు మాట్లాడుతూ.. గతంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సమయంలో టోప్యాతండాలో పాలింగ్‌బూత్ ఉండేదని, ప్రస్తుత ఎన్నికలకు లేకపోవడం ఇబ్బందికరంగా ఉందన్నారు. ఈ విషయమై తహసీల్దార్ మాట్లాడుతూ.. నేడు జరిగే ఎన్నికల్లో గౌతాపూర్‌లోనే ఓటు వేయాలని, త్వరలోనే బూత్ మార్పిడి విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ముసాద్దీక్ తదితరులున్నారు.

మాజీ ఎంపీ కారు తనిఖీ



సురేశ్‌షెట్కార్ కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

నారాయణఖేడ్: టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు రషీద్, సిర్గాపూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మనీష్‌పాటిల్, నాయకులు కొండల్‌రెడ్డిలతో కలిసి బుధవారం ఖేడ్ ప్రాంతంలోని పలు గ్రామాల్లో జరిగిన వివాహ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నాగల్‌గిద్ద మండలంలోని గ్రామాల్లో వివాహ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తుండగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ముక్తాపూర్ వద్ద ఆయన కారును నిలిపి తనిఖీ చేశారు. ఎలాంటి నగదు, వస్తువులు లేకపోవడంతో పంపించి వేశారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లను చూపుతున్న పోలీసులు

మునిపల్లి(అందోల్): బుదేరా చౌరస్తాలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా బుదేరా వైన్‌షాపు నుంచి మందు తరలిస్తున్న ఆటోను స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేశారు. మంగళవారం రాత్రి తనిఖీ చేస్తుండగా ఆటోలో తరలిస్తున్న 575 మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల ప్రజాప్రతినిధితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు.

ఈవీఎంలు భద్రపర్చుటకు ఏర్పాట్లు పూర్తి



కౌటింగ్ హాల్‌లో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

- స్ట్రాంగ్ రూమ్ వద్ద భారీ బందోబస్తు
- ఓట్ల లెక్కింపునకు అనువుగా ఉన్న వైపీఆర్ భవనంలోనే కౌటింగ్
- కేంద్రం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులు



ఈవీఎంలను భద్రపర్చనున్న స్ట్రాంగ్ రూమ్

హవేళిఘణాపూర్(మెదక్): 30న జరుగనున్న మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఎన్నికలకు బుధవారం జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని ఆయా పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతో వెళ్లిన అధికారులు ఎన్నికలు పూర్తయిన వెంటనే వాటిని అధికారులు భారీ భద్రత మధ్య హవేళి ఘణాపూర్‌లోని వైపీఆర్ కళాశాలలోని ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో ఉంచనున్నారు. నర్సాపూర్‌కు ఈవీఎంల భద్రతకు రెండు గదులు, మెదక్ నియోజకవర్గానికి మూడు గదులను కేటాయించి వాటిని ఉంచే స్థలాలో ఇప్పటికే నెంబర్లు వేసి ఉంచారు. కౌంటింగ్ హాలులో సీసీ కెమెరాల ఏర్పాటు, లైటింగ్‌ను బిగించారు. ఈవీఎంలను భద్రపర్చిన అనంతరం భారీ బందోబస్తును ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. 3న మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ఇక్కడే కొనసాగనుంది.

పోలింగ్‌కు సర్వం సిద్ధం



పెద్దశంకరంపేటలో మోడల్ పోలింగ్ కేంద్రం



కొల్చారం(నర్సాపూర్): రంగంపేటలో..

కొల్చారం(నర్సాపూర్): నేడు జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు మండల వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. పోలీస్ స్టేషన్ల వద్ద షామియాల ఏర్పాటు, విద్యుత్, తాగునీరు తదితర ఏర్పాట్లు చేశారు. మండలంలో ఎన్నికల కోసం మొత్తం 32 పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. 26358 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం జరగనున్న ఎన్నికలకు ఈవీఎంలు, సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలో 30,161 మంది ఓటర్లకు 41 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పెద్దశంకరంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు



అధికారులకు సూచనలు చేస్తున్న సీఐ సత్యనారాయణరెడ్డి

- సీఐ సత్యనారాయణరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అధికారులు విధులు నిర్వర్తించాలని సీఐ సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం రూట్ మొబైల్ అధికారులు, సిబ్బంది, పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఈవీఎం, వీవీప్యాట్‌లు, ఎన్నికల సామగ్రి రక్షణ పూర్తి బాధ్యత రూట్ మొబైల్ అధికారులదే అన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దని, రాబోయే 48 గంటలు చాలా కీలకమన్నారు. ప్రతి ఎన్నిక కొత్త అనుభవాన్ని నేర్పిస్తుందని.. అధికారులందరూ సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పకుండా పాటించాలన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



వెల్దుర్తి పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పోలింగ్ సిబ్బంది

వెల్దుర్తి(తూప్రాన్): ఉమ్మడి వెల్దుర్తి మండల వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వెల్దుర్తి మండలంలో 23,941 మంది ఓటర్లు ఉండగా మహిళలు 12,303, పురుషులు 11,638 ఉన్నారు. మండలంలో 33 పోలింగ్ బూతులు ఏర్పాటు చేశారు. అదేవిధంగా మాసాయిపేట మండలంలో సుమారు 9 వేల ఓటర్లకు గాను 12 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల వద్ద ఓటర్లు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేసినట్లు వెల్దుర్తి తహసీల్దార్ తులసీరాం, మాసాయిపేట తహసీల్దార్ జ్ఞానజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఓటర్లందరికి బూత్ లెవల్ అధికారుల ద్వారా ఇంటింటికీ పోలింగ్ స్లిప్పులు అందజేశామన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో విలువుందని, ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవడం మరువద్దు అన్నారు.

ఓటును మరువద్దు



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్ఓ గరీమా అగ్రవాల్

దుబ్బాకటౌన్: పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని దుబ్బాక ఆర్ఓ గరీమా అగ్రవాల్ అన్నారు. బుధవారం లచ్చపేట మోడల్ స్కూల్‌లో ఎన్నికల సిబ్బందికి సామగ్రిని అందించడంతో పాటు సిబ్బందిని కేటాయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 253 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.